క్లుప్తంగా

కేంద్ర నిధులతోనే గ్రామాల అభివృద్ధి

అచ్చంపేట రూరల్: కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేవని సతీష్ మాదిగ అన్నారు. శుక్రవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 9ఏళ్ల పాటు అధికారంలో ఉన్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజుకు ఎన్నికల వేళ అభివృద్ధి పనులు గుర్తుకు వచ్చాయా? అని ప్రశ్నించారు. రూ.200 కోట్లకు సంబంధించి ప్రొసిడింగ్ చూయించాలని డిమాండ్ చేశారు.

ఇంటర్వ్యూలు పూర్తి

వెల్దండ: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు బ్యాంక్ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలానికి మూడు యూనిట్లు రావడంతో 70మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. 52మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. మైనార్టీ రుణాలకు ఎంపికైన వారికి సమాచారం అందిస్తామని బ్యాంకు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, బ్యాంక్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

గౌడ సమావేశానికి తరలిరండి

వెల్దండ: నియోజకవర్గ స్థాయిలో ఈనెల 29న ఆమనగల్లులో నిర్వహించే గౌడ సంక్షేమ సమావేశానికి అన్ని గ్రామాల సంఘం నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు మట్ట వెంకటయ్యగౌడ్ శుక్రవారం తెలిపారు. ఆమనగల్లు కంఠమహేశ్వర దేవాలయంలోని ఉదయం 10గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వాటర్ ట్యాంకులు పరిశీలించిన డీఈ

తాడూరు: మండల కేంద్రంలోని 4 వాటర్ ట్యాంకులను శుక్రవారం సాయంత్రం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ భరతసింహారెడ్డి, ఏఈ హేమంత్‌రెడ్డి పరిశీలించారు. వారు ట్యాంక్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని ఎలాంటి లీకేజీలైనా సరిచేయించాలని, నీరు కలుషితం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని వారు సర్పంచ్ యాదమ్మను ఆదేశించారు.

పంటల నమోదు చేసుకోండి

వెల్దండ: రైతులు సాగుచేస్తున్న పంటలను నమోదుచేయించుకోవాలని ఏఈఓ గణేష్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దాపూర్ లో ఏఈఓ పంటల నమోదు చేపట్టారు. అనంతరం వరి పంటలకు సోకుతున్న తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. వరిపంటల్లో కలుపు యాజమాన్యం పాటించాలన్నారు.

కిసాన్ సమృద్ధిపై రైతులకు అవగాహన

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని పలు ఫర్టిలైజర్ షాపుల వద్ద శుక్రవారం బీజేపీ నాయకులు కిసాన్ సమృద్ధి పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. కిసాన్ సమృద్ధి కేంద్రాల ద్వారా రైతులకు, వ్యవసాయానికి అవసరమయ్యే పనిముట్లు, ఎరువులు, విత్తనాలు భూసారపరీక్షలతో పాటు అన్ని అంశాలు ఇక్కడ అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో రాఘవేందర్‌గౌడ్, వివేకానంద, శ్రీధర్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జంగిరెడ్డి సేవలు మరువలేనివి

అచ్చంపేట రూరల్: దివంగత డాక్టర్ మంద జంగిరెడ్డి నల్లమల ప్రాంత ప్రజలకు చేసిన వైద్యసేవలు మరువలేనివని మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, మాజీ చైర్మన్ తులసీరాం, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్ అన్నారు. జంగిరెడ్డి 29వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం బొల్లట్‌పల్లి గేటు సమీపంలో లెనిటీ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. శ్రీనివాస్‌రెడ్డి, బాలాజీ, వైద్యులు పాల్గొన్నారు.

ఘనంగా పీర్ల ఊరేగింపు



తాడూరు/ కల్వకుర్తి రూరల్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం 9వ రోజు సందర్భంగా ప్రధాన వీధుల వెంట పీర్లను ఊరేగించారు. శనివారం ముగింపు సంబరాలు ఉంటాయని నిర్వాహకులు ఖదీర్, యూసుఫ్ తెలిపారు. కల్వకుర్తి మండలంలోని ఎల్లికల్‌లో నిర్వహించిన పీర్ల ఊరేగింపులో ఎమ్మెల్సీ గోరటి వెంకన్న పాల్గొని ప్రార్థనలు చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

కల్వకుర్తి రూరల్: మండలంలోని తాండ్ర గ్రామానికి చెందిన జ్యోతికి రూ.18వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. శుక్రవారం గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకులు చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో యాదయ్య, బాలకృష్ణ, కృష్ణయ్య, శ్రీనివాస్ శర్మ, విజయ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



అమ్రాబాద్‌లో నీటిలో మందును కలుపుతున్న వైద్య సిబ్బంది



యాదిరెడ్డిపల్లిలో బ్లీచింగ్ పౌడర్ వేస్తున్న సిబ్బంది

అమ్రాబాద్: శుభ్రత పాటిస్తేనే ప్రజల ఆరోగ్యంగా ఉంటారని డివిజన్ ఉప మలేరియాధికారి అశోక్ ప్రసాద్ సూచించారు. మన్ననూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో పరిసరాలను పరిశీలించి నిల్వ ఉన్న నీటి గుంటల వద్ద టెమిపాస్ మందును కలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వర్షాలకు నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెందుతాయని తద్వారా వివిధ రకాల వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని వివరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి నీరు నిల్వ లేకుండా చూడాలని అవగాహన కల్పించారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

అమ్రాబాద్‌తో పాటు మండలంలోని తిర్మలాపూర్(బీకే), ఉప్పునుంతల(బీకే)లో శుక్రవారం ఎంపీడీఓ రామ్మోహన్, ఎంపీఈఓ వెంకటయ్య సందర్శించి పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. నర్సరీ, వైకుంఠ ధామాలతో పాటు వీధుల వెంట తిరిగి పరిసరాలను పరిశీలించారు.

మన్ననూర్: వాతావరణంలో వచ్చిన మార్పులను దృష్టిలో ఉంచుకుని గ్రామాలు, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని డివిజనల్ మలేరియా అధికారి అశోక్ ప్రసాద్ సూచించారు. శుక్రవారం మన్ననూర్‌లో ఉమామహేశ్వర, జంగాల కాలనీల్లో పల్లె ఆస్పత్రి సిబ్బందితో కలిసి ఇంటింటికీ తిరిగి డ్రై డే ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌లు లక్ష్మణ్, సులోచన, శైలజ, సూపర్‌వైజర్ పార్వతి, ఆరోగ్య కార్యకర్తలు తిరుపతమ్మ, సరస్వతీ, భారతి, పార్వతి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

లింగాల: వర్షాలకు వ్యాధులు సోకకుండా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ గీతాంజలి ప్రజలను సూచించారు. శుక్రవారం మండలంలోని అంబట్‌పల్లిలో డ్రై డేను నిర్వహించారు. ఎంపీడీఓ, సర్పంచ్ రవిశంకర్, వైద్య సిబ్బంది గ్రామంలోని ఆయా వార్డులలో తిరిగి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.

తాడూరు: డ్రై డే సందర్భంగా శుక్రవారం వైద్య సిబ్బంది, ఎంపీడీఓ ఆధ్వర్యంలో మండలంలోని ఇంద్రకల్, యాదిరెడ్డిపల్లిలో పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ గంగమోహన్, వైద్య సిబ్బంది శ్రీనివాసులుతో పాటు ఇంద్రకల్‌లో పాల్గొన్న డీఎల్‌పీఓ రామ్మోహన్ ఇంటింటికీ తిరిగి నీటి తొట్లలలో, ట్యాంకుల్లో నిల్వ ఉన్న నీటిని ఖాళీ చేయించారు.

కొల్లాపూర్ రూరల్: మండలంలోని బోడబండతండాలో మండల స్థాయి హెల్త్, మండల అభివృద్ధి కార్యాలయం అధికారులు డ్రై డే నిర్వహించారు. తండాలో ఇళ్ల వద్ద నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ చెన్నమ్మ, ఎంపీఈఓ మనోహర్, సబ్ యూనిట్ అధికారి రామ్మోహన్, దివాకర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం



పులిజాల శివారులో రైతులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

అచ్చంపేట రూరల్: రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని పులిజాలలో గిరాయికుంట సమీపంలో పంట పొలాల మధ్యలో రైతులతో కలిసి సమావేశం నిర్వహించారు. కేఎల్ఐ కాల్వ పొడిగింపులో భూములు కోల్పోతున్న రైతులతో మాట్లాడారు. పులిజాల శివారులో ఉన్న గిరాయికుంటను కేఎల్ఐ నీటితో నింపితే దాదాపు 600 ఎకరాలకు సాగు నీరు అందనుందన్నారు. రైతులందరూ సహకరించాలని కోరారు. సాగు నీరు అందించి రైతులను రారాజులుగా చేయడమే తమ లక్ష్యమన్నారు. తోటి రైతులకు మేలు కలుగుతుందంటే తాము భూములు ఇవ్వడానికి సమ్మతమేనని తెలిపారు. కార్యక్రమంలో రాజేశ్వర్‌రెడ్డి, రామాచారి, పర్వతాలు, రాజిరెడ్డి, లోక్యానాయక్, నారాయణరెడ్డి, మల్లేష్, రవీందర్‌రెడ్డి, మధుసూదన్ పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక

బల్మూర్: మొహర్రం పండుగ మతసామరస్యానికి ప్రతీక అని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. మహాదేవ్‌పూర్‌లో రెడ్డ ఉస్సేన్ పీర్ దర్గా, మసీద్‌ను ఆయన శుక్రవారం దర్శించుకున్నారు. పీర్లకు మొక్కులతో ప్రార్థనలు చేశారు. రాష్ట్రంలో హిందూ, ముస్లిం తారతమ్య బేధం లేకుండా అందరూ సంతోషంగా చేసుకునే పండుగ మొహర్రం అని, పూర్వ కాలం నుంచి మహాదేవ్‌పూర్ పీర్ దర్గాకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. మసీద్ వద్ద భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

దార్శనికుడు జైపాల్‌రెడ్డి



కల్వకుర్తి టౌన్: కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి రాజకీయాలలో కొత్తగా వచ్చేవారికి దార్శనికుడని డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద జైపాల్‌రెడ్డి వర్ధంతిని నిర్వహించారు. విజయ్ కుమార్‌రెడ్డి, ఆంజనేయులు, శ్రీకాంత్, చంద్రకాంత్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం జైపాల్‌రెడ్డి వర్ధంతిని పార్టీ కార్యకర్తలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మోతీలాల్‌నాయక్, శేఖర్, పర్వత్‌రెడ్డి, పుల్లయ్య, శ్రీనివాస్‌యాదవ్, చందునాయక్, రాజు తదితరులు ఉన్నారు.

హరితహారం లక్ష్యాన్ని అధిగమించాలి



చారకొండలో కూలీలతో మట్లాడుతున్న ఎంపీడీఓ జయసుధ

ఉప్పునుంతల: మండలంలోని గ్రామాల్లో నిర్దేశించిన విధంగా మొక్కలను నాటి హరితహారం లక్ష్యాన్ని అధిగమించాలని ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు సూచించారు. శుక్రవారం మండలంలోని లత్తీపూర్, వెల్టూర్ శివార్లలో ఉన్న శ్రీశైలం-హైదరాబాద్ రహదారికి ఇరువైపుల మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఈజీఎస్ ఏపీఓ సుదర్శన్‌గౌడ్‌తో కలిసి ఎంపీడీఓ పరిశీలించారు. ముసురు వర్షాలకు అనుకూలమైన వాతావరణం నెలకొన్నందున కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో పూర్తిచేయించాలని సూచించారు. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటించాలని చెప్పారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

బల్మూర్: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని కోనేర్ సంస్థ కోఆర్డినేటర్ ఖయ్యూం సూచించారు. శుక్రవారం ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని బాణాల, బిల్లకల్‌లో మొక్కలు నాటారు. ప్రతి గ్రామంలో మొక్కలు నాటడం అలవాటుగా చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇస్మాయిల్, పెద్దులయ్య, లలిత, గ్రామస్తులు పాల్గొన్నారు.

చారకొండ: మండలంలోని గోకారంలో శుక్రవారం ఎంపీడీఓ జయసుధ హరితహారంలో భాగంగా నాటే మొక్కలను పరిశీలించారు. గోకారం గేట్ పరిధిలో ప్రధాన రహదారి వెంట పొడవైన మొక్కలు నాటాలన్నారు.

టీ-9 టికెట్లపై అవగాహన

కొల్లాపూర్: ఆర్టీసీలో అమలు చేస్తున్న టీ-9 టికెట్లపై డీఎం రాజేశ్వర్ ప్రయాణికులకు అవగాహన కల్పించారు. శుక్రవారం ఆర్టీసి బస్సుల్లో ఎక్కిన ప్రయాణికులకు టికెట్ వివరాలను తెలిపారు. అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని బోడబండ తండా, కుడికిల్లలో కొల్లాపూర్ ఎక్సైజ్ అధికారులు, మహబూబ్‌నగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా సారా తయారు చేస్తున్న ఇళ్లపై దాడులు చేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని, వారిపై కేసులు నమోదు చేశారు. 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు.

కోడేరు: మండలంలోని మాచుపల్లి, రాజాపూర్, సింగాయిపల్లితండాలో ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించి 14 లీటర్ల సారా, 100 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి, నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఏడుకొండలు తెలిపారు.

చెట్లు నరికినందుకు జరిమానా

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని హైదరాబాద్ రోడ్డులో ఉన్న పెట్రోల్ బంక్ పక్కన దుకాణాదారులు వారి దుకాణాలకు ఎదురుగా ఉన్న చెట్లను నరికివేశారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్, కార్యాలయ అధికారులు దుకాణాదారులను హెచ్చరించి, చెట్లను కొట్టేసినందుకుగాను ఇద్దరు దుకాణాదారులకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున రూ.10వేల జరిమానా విధించారు. దుకాణాలకు అడ్డుగా ఉన్నాయని ఎవరైనా పట్టణ పరిధిలో చెట్లను నరికివేయటం చేస్తే జరిమానాలతో పాటుగా, మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'ఉపాధి' పనులపై ఆడిట్

అమ్రాబాద్: మండలంలోని జంగంరెడ్డిపల్లిలో జాతీయ ఉపాధి హామీ పనులను శుక్రవారం సామాజిక తనిఖీ బృందం పరిశీలించింది. రైతుల పొలాల్లో చేసిన పనులు పరిశీలించి కొలతలు తీసుకున్నారు. కూలీల జాబ్‌కార్డులు చూశారు. శివకుమార్, రాజారాంనాయక్, వీఎస్‌ఏలు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు

ఉప్పునుంతల: మండలంలోని తాడూరులో ఉపాధి హామీ కూలీలతో స్థానిక ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ తన సొంత వ్యవసాయ పనులు చేయించుకుంటున్నాడని సర్పంచ్ గున్నమోని అలివేలు ఆరోపించారు. శుక్రవారం సర్పంచ్ పంచాయతీ కార్యదర్శి తులసీరాంతో కలిసి ఈజీఎస్ కూలీల మస్టర్ కాఫీలను తనిఖీ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ పొలంలో వ్యవసాయ పనులు చేస్తున్న కూలీల ఫొటోలను సేకరించారు. ఈ విషయంపై ఈజీఎస్ ఏపీఓ సుదర్శన్‌గౌడ్‌ను మాట్లాడుతూ.. ఫీల్డ్ అసిస్టెంట్‌పై సర్పంచ్ ఫిర్యాదు మేరకు మస్టర్ కాపీలను తనిఖీ చేసి, కూలీలతో విచారణ అనంతరం ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

ఇంటింటి ప్రచారానికి ప్రాధాన్యత

లింగాల: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టే పనులపై ప్రతి కార్యకర్త ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరంగల్, యూత్ డిక్లరేషన్ అంశాలను కరపత్రాలు, స్టిక్కర్ల రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రతి ముఖ్య నాయకుడు ఒక్కో వార్డుకు ఇన్‌చార్జ్‌గా వ్యవహరించాలన్నారు. పట్టణంలోని ఒకటవ వార్డుకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరడంతో వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. శ్రీనివాస్‌రాథోడ్, వెంకటయ్య, లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

అచ్చంపేట రూరల్: పట్టణంలోని వెంకటేశ్వరనగర్ కాలనీలో తాళం వేసిన ఇంటిలో చోరీ చేశారు. పట్టణ ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీలో నివాసం ఉంటున్న బద్రు ఈనెల 5న సొంత గ్రామమైన లింగాలకు కుటుంబసభ్యులతో వెళ్లాడు. శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటం, బీరువాలో బంగారు, వెండి ఆభరణాలు (సుమారు రూ. 60వేల విలువ) గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లినట్లు గుర్తించారు. వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సీఆర్టీ పోస్టులు స్థానికులకే కేటాయించాలి

మన్ననూర్: నాగర్‌కర్నూల్ జిల్లా ఏజెన్సీ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, ఏఎన్ఎం పోస్టులను స్థానికులతోనే భర్తీ చేయాలని గిరిజన సేవా సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు జైపాల్‌నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం మన్ననూర్‌లోని అంబేద్కర్ కూడలిలో ఏజెన్సీ నిరుద్యోగ యువకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏజెన్సీలో గిరిజన తెగలకు చెందిన అనేక మంది డిగ్రీలు, బీఈడీ, పీజీలు చేసి నిరుద్యోగులుగా పూట గడువక తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని తెలిపారు. అధికారులు జనరల్ రోస్టర్ పద్ధతి అమలు చేయాలనుకోవడం సరైంది కాదనఅనరు. ఉట్నూర్, భద్రాచలం ఐటీడీఏల పరిధిలో ప్రభుత్వ నిబంధనలు అనుసరిస్తూ ఏజెన్సీలో స్థానికులకే అవకాలు కల్పిస్తున్న విషయాన్ని గమనించాలన్నారు.

సజావుగా ఎన్నికల ప్రక్రియ



కల్వకుర్తి: రాబోయే శాసనసభ ఎన్నికల ప్రక్రియను సజావుగా సాగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఆర్డీఓ శ్రీను సూచించారు. శుక్రవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గుర్తింపు పొందిన రాజకీయపార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఓటర్ జాబితా నమోదు ప్రక్రియతో పాటు ఇప్పటి వరకు చేపట్టిన ఎన్నికల నియమావళిపై ఆర్డీఓ మాట్లాడారు. సమావేశంలో తహసీల్దార్ రాంరెడ్డి, నాయకులు విజయ్‌కుమార్, యాదిలాల్, ఆంజనేయులు, మల్లేష్, అంజి తదితరులు ఉన్నారు.

ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించాలి

కల్వకుర్తిరూరల్: ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించాలని ఎంఎస్ఎఫ్ జిల్లా కో ఇన్‌చార్జ్ భరత్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్సీ హస్టల్‌లో విద్యార్థులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఆగస్టు రెండో వారంలో మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అనిల్‌కుమార్, శేఖర్, కరణ్, పవన్, నవీన్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ హస్టల్‌లో భోజనం పరిశీలన

పట్టణంలోని ఎస్సీ బాలుర వసతిగృహంలో శుక్రవారం కులవివక్ష వ్యతిరేక పోరాటసమితి నాయకులు భోజనాన్ని తనిఖీచేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్, జగన్, వెంకటయ్య, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీ దిష్టిబొమ్మ దహనం

కొల్లాపూర్: బీజేపీ ఎంపీ సోయం బాబురావు దిష్టిబొమ్మను శుక్రవారం పట్టణంలో గిరిజన సంఘం నాయకులు దహనం చేశారు. తెలంగాణలో లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలంటూ ఆయన వ్యాఖ్యలను ఖండించారు. గిరిజనుల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నం చేసిన ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్, హనుమంతునాయక్, బానునాయక్, భాస్కర్ నాయక్, శంకర్ నాయక్, రమేష్, చంద్రశేఖర్ ఉన్నారు.

మన్ననూర్: బీజేపీ ఎంపీ సోయం బాబురావ్‌ను ఆ పార్టీ నుంచి తక్షణమే బర్తరఫ్ చేయాలని గిరిజన సేవా సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి జైపాల్‌నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం మన్ననూర్‌లోని అంబేద్కర్ కూడలిలో ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఇచ్చిన ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని అన్నారు.

ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి



ప్రశంసాపత్రాలు అందుకున్న ఉద్యోగులతో డిప్యూటీ ఆర్ఎం బాబునాయక్

కల్వకుర్తి టౌన్: ఆర్టీసీ ఉద్యోగులు బాధ్యతతో పని చేస్తే గుర్తింపు తప్పనిసరిగా ఉంటుందని డిప్యూటీ ఆర్ఎం బాబునాయక్ అన్నారు. శుక్రవారం డిపో పరిధిలో జూన్ నెలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ఎంవీఐ రాంబాబుతో కలిసి ప్రశంసా పత్రాలను అందజేశారు. రహదారి భద్రతా నియమాలు పాటించి డ్రైవర్లు వాహనాలు నడిపితేనే ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చిన వారు అవుతారని ఆయన అన్నారు. కార్యక్రమంలో డీఎం శ్రీకాంత్, సీఐ శ్వేత, ఎంఎఫ్ సురేందర్, డిపో ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వమే నేరుగా జీతాలు అందించాలి



వినతి అందజేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

కల్వకుర్తి టౌన్: వైద్యశాఖలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఏజెన్సీ ద్వారా కాకుండా ప్రభుత్వమే నేరుగా అందించాలని సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ శివరాంకు సమస్యలతో కూడిన వినతిని అందించారు. కొన్నేళ్లుగా ఇదే పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయకపోవటం బాధాకరమని, ఇప్పటికైనా ప్రభుత్వం పట్టించుకుని ట్రెజరీ ద్వారా జీతాలను అందించాలని కోరారు. కార్యక్రమంలో రాజశేఖర్, నాగేశ్వర్‌రావు, లక్ష్మయ్య, కృష్ణన్, వెంకటయ్య, అలివేలు, వెంకటమ్మ, జుబేర్ పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో భూ పోరాటం



ప్రజలతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో ప్రభుత్వ భూమిలో నివసిస్తున్న వారితో శుక్రవారం సీపీఎం నాయకులు సమావేశమయ్యారు. 2007లో ముదిగొండలో భూ పోరాటాలు నిర్వహించి మరణించిన అమరవీరులకు వారు నివాళులర్పించారు. సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో భూమి కోసం పోరాడుతున్న ఏడుగురిపై అప్పటి ప్రభుత్వం పోలీసులు కర్కశంగా కాల్పులు చేసి వారి ప్రాణాలను తీసుకున్నారన్నారు. వారి స్ఫూర్తితోనే ఇప్పుడు పేదలందరూ ఐక్యమై ఇళ్ల కోసం పోరాడుతున్నారని, అలాంటి వారికి ప్రభుత్వం భూమి లేని వారికి భూమి, ఇళ్లు లేని వారికి స్థలాలను ఇవ్వాలన్నారు. లేదంటే సీపీఎం ఆధ్వర్యంలో నిరంతరం రాష్ట్ర వ్యాప్తంగా పేద ప్రజలంతా కలిసి పోరాటాలు చేస్తామని వారు హెచ్చరించారు. మండలంలో గుడిసెల్లో ఉంటున్న ప్రతి ఒక్కరికి ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఈశ్వర్, హనుమంతు, చిట్టమ్మ, చందు, రాముడు, పెంటయ్య పాల్గొన్నారు.

డ్రమ్‌సీడర్ ద్వారా విత్తనాలు వేసుకోండి



పెద్దకొత్తపల్లిలో డ్రమ్‌సీడర్ ద్వారా వరి విత్తనాలు వేస్తున్న రైతు నాగరాజు

పెద్దకొత్తపల్లి: వరినాట్లు ఆలస్యం కావడంతో రైతులు డ్రమ్‌సీడర్ ద్వారా పొలంలో వరి విత్తనాలు వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రమేష్ సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం రైతు గోపాల నాగరాజు డ్రమ్‌సీడర్ ద్వారా వరి విత్తనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరాకు వరి నాట్లు వేసుకుంటే 25 కిలోల విత్తనం అవసరం ఉంటుందని తెలిపారు. ఈ డ్రమ్ సీడర్ ద్వారా 8-12 కిలోల విత్తనం సరిపోతుందన్నారు. వరినాట్లు వేసుకునే కూలి రైతులకు మిగులు తాయన్నారు. పెద్దకార్పాముల రైతులు డ్రమ్ సీడర్ ద్వారా విత్తనాలు వెదజల్లె పద్ధతిని పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓలు మజీద్, జానకీరాం పాల్గొన్నారు.

కృష్ణమ్మ పరవళ్లు



ఎగువ నుంచి దిగువకు ప్రవహిస్తున్న కృష్ణమ్మ

పెంట్లవెల్లి: ఎగువన జూరాల నుంచి గేట్ల ద్వారా నీళ్లు వదలడంతో గురువారం రాత్రి నుంచి మండలంలోని జటప్రోలు, చల్లపాడు, మంచాలకట్ట, మల్లేశ్వరం, సోమశిల గ్రామాలకు వరద తాకింది. దీంతో మత్స్యకారులు వేటకు వెళ్లకూడదని స్థానిక ఎస్ఐ రామేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ దామోదర్ సూచించారు. ఇంజన్ బోట్లుపై నదిలో తిరగకూడదని హెచ్చరించారు. అధికారులను కాదని ఎవరైనా వేటకు వెళితే ప్రయాణికులను చేరవేసినా బోట్లు, పుట్లు, వలలను సీజ్ చేస్తామని అధికారులు తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



కోడేరు: మండలంలోని కొండ్రావుపల్లికి చెందిన 30మంది ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో శుక్రవారం చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో రూ.45లక్షలతో సీసీరోడ్లు, రూ.5లక్షతో ఎస్సీ కమ్యూనిటీ భవనం, హైమాస్ట్ లైట్లు, రూ.61లక్షలతో గ్రామాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

కొల్లాపూర్: పట్టణంలోని ఎరువుల దుకాణాలను శుక్రవారం ఏడీఏ చంద్రశేఖర్, ఏఓలు నాగరాజు, మహేష్‌కుమార్ తనిఖీ చేశారు. ఎరువుల విక్రయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. దుకాణాల వద్ద ధరల పట్టికలు ఏర్పాటు చేయాలని, స్టాక్‌బోర్డులు పెట్టాలని సూచించారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే రైతులు తప్పనిసరిగా రశీదులు పొందాలన్నారు.

మినుములు, కందుల పంపిణీ

కొల్లాపూర్: పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద రైతులకు మినుములు, కందులు పంపిణీ చేశారు. జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా వంద శాతం రాయితీపై 902 మినీ కిట్స్ కందులు, 200 మినీ కిట్స్ మినుములను ఏఓ నాగరాజు రైతులకు అందజేశారు. పప్పు ధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు విత్తనాల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. ఏఈఓ శిరీష, ఎంపీటీసీ శంకర్ నాయక్, వెంకట్‌రెడ్డి, రాంచందర్‌యాదవ్, మోహన్‌కుమార్ ఉన్నారు.

డ్రైవర్‌పై కేసు నమోదు

వెల్దండ: మండలంలోని రాఘయపల్లి సమీపంలో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో గాయపడిన కొమ్ము శైలజ ఫిర్యాదు మేరకు శుక్రవారం కారు డ్రైవర్ శివాజీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. బల్మూర్‌కు చెందిన శ్రీను, శైలజ భార్యాభర్తలు గురువారం రాత్రి హైదరాబాద్ నుంచి బల్మూర్‌కు ద్విచక్ర వాహనపై వెళ్తున్నారు. మార్గమధ్యలో మండలంలోని రాఘయపల్లి సమీపంలో లక్ష్మాపురానికి చెందిన శివాజీ కారు ఎదురుగా వచ్చి వారి బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో శ్రీను, శైలజలు గాయపడ్డారు.